ప్రజాశక్తి
గురువారం 10 జూలై 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సమ్మె సక్సెస్

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీ కార్మిక ప్రదర్శనలు
- ప్రభుత్వ రంగ సంస్థల వద్ద నిరసనలు
- పలుచోట్ల స్తంభించిన కార్యకలాపాలు
- నష్టదాయక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్



విశాఖలో నిర్వహించిన కార్మిక ర్యాలీలో సిహెచ్.నర్సింగరావు తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి విలేకరులు

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బుధవారం జయప్రదమైంది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమల కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లు తమ విధులను బహిష్కరించి భారీ ర్యాలీలు నిర్వహించారు. మానవహారాలు చేపట్టి, నిరసనలు తెలిపారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, వివిధ ప్రభుత్వ స్కీమ్స్‌లో పనిచేస్తున్న ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం పథకం, విఒఎ, ఆర్‌పి, స్కూల్ శానిటేషన్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యో గులుగా గుర్తించాలని సమ్మెలో భాగంగా కార్మికులు నినదించారు. ఆటో, మోటార్, ముఠా, తోపుడుబండ్లు, భవన నిర్మాణ కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఇపిఎస్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



సమ్మెతో బోసిపోయిన ఎల్‌ఐసి కార్యాలయం



అనకాపల్లిలో నిర్వహించిన కార్మిక ప్రదర్శనలో లోకనాథం తదితరులు

విశాఖలో దొండపర్తిలోని రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ కార్మిక ప్రదర్శన జరిగింది. అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మిగతా 2లో..

11, 12 తేదీల్లో విశాఖకు సిఒపియు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ నేతృత్వంలోని ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలతో కూడిన రాష్ట్ర పబ్లిక్ అండర్ టేకింగ్స్ శాసనసభా కమిటీ (సిఒపియు) ఈ నెల 11, 12 తేదీలలో విశాఖపట్నం రానుందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం గోదావరి ఎక్స్‌ఎక్స్‌లో విశాఖపట్నం చేరుకొని సర్క్యూట్ హౌస్‌కు వేళతారని, ఉదయం 10 గంటలకు కలక్టరేట్‌లో విఎంఆర్‌డిఎ, ఎపి మెడ్‌టెక్ జోన్, ఎపిఐఐసి, ఎపి టూరిజం, శ్రీకాకుళం, గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ల వార్షిక నివేదికలు, కార్యకలాపాలపై అధికారులతో సమీక్షిస్తా రన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నగరంలో క్షేత్ర పర్యటన చేస్తారని, 12న ఉదయం కలక్టరేట్‌లో ఎపిఇపిడిసిఎల్, ఎఐసి, ఎఎంటిజెడ్, మెడి వాలీ ఇంక్యుబేషన్ కౌన్సిల్, ఎపి గిరిజన కార్పొరేషన్, బయో వ్యాలీ ఇంక్యుబేషన్ కౌన్సిల్, వైజాగ్ అపెరల్ పార్క్, ఎపిఎస్ ఆర్‌టిసిల వార్షిక నివేదికలు, కార్యకలాపాలపై సమీక్ష చేస్తారనానరు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నగరంలో క్షేత్ర పర్యటన అనంతరం, రాత్రి 10 గంటలకు తిరిగి విజయవాడ వెళ్తారని కలెక్టర్ తెలిపారు. కూన రవికుమార్ అధ్యక్షతన కమిటీలో ఎమ్మెల్యేలు ఎ.ఆనందరావు, ఎన్.ఈశ్వరరావు, జి.సత్య నారాయణ, జి.శిరీష, వి.కుమార్‌రాజా, ఆర్‌విఎస్‌కెకె.. రంగారావు, టి.శ్రావణ్‌కుమార్, వి.వెంకట కృష్ణప్రసాద్, మిగతా 2లో..

840 కిలోల గంజాయి పట్టివేత

వార్త 6లో..

ఆన్‌లైన్‌లో విఎంఆర్‌డిఎ సేవలు

వార్త 2లో..

శారద నదిలో మునిగి వ్యక్తి మృతి

వార్త 5లో..

భక్తి శ్రద్ధలతో సింహగిరి ప్రదక్షిణ

పోటెత్తిన భక్తులు - 32 కిలోమీటర్ల మేర నడక



గిరి ప్రదక్షిణకు భారీగా తరలివచ్చిన భక్తజనం

ప్రజాశక్తి - సింహాచలం : బుధ, గురువారాల్లో జరిగే సింహగిరి ప్రదక్షిణకు తొలిరోజు భక్తులు పోటెత్తారు. అప్పన్న కొండ తొలి పావంచా వద్ద ఉదయాన్నే కొబ్బరికాయ కొట్టి కొండ చుట్టూ 32 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రదక్షిణకు భక్తులు శ్రీకారం చుట్టారు. రాత్రంతా వారి ప్రదక్షిణ కొనసాగుతూనే ఉంది. గిరి ప్రదక్షిణ అధికారిక కార్యక్రమం మాత్రం మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభమైంది. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు స్వామివారి పుష్ప రథాన్ని జెండా ఊపి ప్రారంభించడంతో గిరి ప్రదక్షిణ వేడుక ప్రారంభమైంది. ఆయన వెంట కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఇఒ త్రినాధరావు తదితరులు ఉన్నారు. ఈ గిరి ప్రదక్షిణకు అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. ఇటీవల చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు మృతిచెందడం, ఇతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడా ఏ విధమైన లోపం తలెత్తకుండా పలు చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించాయి.

ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం గిరి ప్రదక్షిణలోని ఏర్పాట్లును జివిఎంసి కమిషనర్ మిగతా 2లో..

హైడ్రోపై ముందుకెళ్లొద్దు

- ఆ ప్రాజెక్టుల ఏర్పాటుతో గిరిజనులకు, ప్రజలకు తీవ్ర నష్టం
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో గళమెత్తిన సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు
- ఆయనతో గొంతు కలిపిన సహచర జెడ్‌పిటిసిలు
- ప్రాజెక్టుల అనుమతుల రద్దు కోసం తీర్మానం : ఛైర్‌పర్సన్ సుభద్ర
- విద్య, వైద్య రంగ సమస్యలపై చర్చ



జెడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న సుభద్ర, చిత్రంలో విశాఖ, అల్లూరి జిల్లాల కలెక్టర్లు



నిరసన తెలుపుతున్న గంగరాజు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జెడ్‌పి సమావేశ మందిరంలో వాడివేడిగా సాగింది. హైడ్రో పవర్ ప్రాజెక్టులపై సుదీర్ఘ చర్చ నడిచింది. ఆ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తే అల్లూరి జిల్లాలోని గిరిజనులతో పాటు అనకాపల్లి, విశాఖ జిల్లాల వాసులకూ తీవ్ర నష్టం జరుగనుందని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సమ్మె సక్సెస్

బహిరంగ సభ నిర్వహించారు. సమ్మెకు సిపిఎం సిపిఐ, ఇతర వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఈ బహిరంగ సభకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకురాలు ఎం.లక్ష్మి, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు ఆ సభలో మాట్లాడారు. బ్రిటిష్ కాలంలోనే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను మార్చి మోడీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కోల్పోతారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు నేషనల్ మానిటైజేషన్ ఆఫ్ పైపులైన్ పేరుతో దోచిపెట్టడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలను తెలియజేశారు. కార్మిక హక్కుల రక్షణ కోసం, ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కోసం భవిష్యత్తులో మరిన్ని నిరవధిక సమ్మెలు చేయడానికి కార్మికవర్గం సిద్ధంగా ఉందన్నారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎస్‌కె.రెహమాన్‌లు సంఘీభావం తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు పి.వెంకటరెడ్డి, పి.మణి, బి.జగన్, జిఎస్‌కె.అచ్యుతరావు, కె.సత్యనారాయణ, తిరుపతిరావు, కె.దేవా, వాసుదేవరావు, అనిల్ కుమార్, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు గంట్ల శ్రీనుబాబు, లోకో రన్నింగ్ స్టాఫ్ యూనియన్ నాయకులు భోలేనాథ్, స్కీం వర్కర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారుల డప్పు వాయిద్యాలు, తీన్మార్, విప్లవ కార్మిక గీతాలు అలరించాయి.

అనకాపల్లిలో అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ముఠా, మున్సిపల్, గ్రామ పంచాయతీ, ఆర్ఎఆర్ఎస్ కార్మికులు, బేవరేజెస్ హమాలీలు, స్కూల్ స్వీపర్లు, విఒఎలు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యాలయం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూ చౌక్ నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం మాట్లాడుతూ పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని చెప్పారు. తక్షణమే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం 11 ఏళ్లుగా కార్పొరేట్ కంపెనీలకు ప్రజల సంపదను దోచి పెడుతోందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, రైతు కూలీ సంఘం కార్యదర్శి కె.మోహన్, ఎఐఎఫ్‌టియు కార్యదర్శి రాంబాబు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, వివిధ సంఘాల నేతలు కాసులమ్మ, రమణమ్మ, గంటా శ్రీరామ్, కొండారావు, కె.అప్పలరాజు, వి.రూపవతి, సూర్యలక్ష్మి, అజయ్, ఈ.అప్పారావు, కె.నందీశ్వరరావు, అప్పారావు, కె.తేలయ్యబాబు, యేసురాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సింహగిరి ప్రదక్షిణ

కేతన్ గార్గ్ పరిశీలించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయం సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, పర్యవేక్షక ఇంజినీర్లు పివి.సత్యనారాయణ రాజు, గోవిందరావులతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. భక్తులు నడక మార్గంలో అలసిపోయి ఉంటారని, వారి నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదునూ సహనంతో స్వీకరించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలని సూచించారు. అనంతరం లుంబిని పార్క్, వెంకోజీ పాలెం వద్ద ఏర్పాటుచేసిన తాగునీటి పాయింట్లను సందర్శించి భక్తులకు అందించే సేవలో నిమగ్నమై ఉండాలని ఎమినిటీస్ కార్యదర్శులకు కమిషనర్ ఆదేశించారు. అనంతరం నడక మార్గంలో కమిషనర్ పయనిస్తూ భక్తుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను, ఏర్పాట్లను గమనిస్తూ సంబంధిత అధికారులకు, విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తూ వచ్చారు.

11, 12 తేదీల్లో

విశాఖకు సిఒపియు

ఎమ్మెల్సీలు బి.రామ్‌గోపాల్ రెడ్డి, కాంట్రాక్టర్ ఇసాక్ భాషా, డాక్టర్ కుంభా రవిబాబు ఉన్నారన్నారు.

నేడు విశాఖకు మేఘాలయ పిఎసి

మేఘాలయ రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటి స్టడీ టూర్ నిమిత్తం గురువారం విశాఖపట్నం చేరుకొని రాత్రి బస చేస్తారని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు.శుక్రవారం విశాఖ నగరంలో పలు ప్రదేశాలను సందర్శించి రాత్రి బస చేస్తారని, శనివారం విశాఖపట్నం నుండి భువనేశ్వర్ వెళ్తారని తెలిపారు.

బస్తర్ ఐజి ప్రకటనను ఖండించండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : లొంగిపోండి, లేకుంటే చంపుతామంటూ మావోయిస్టులను ఉద్దేశించి, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో బస్తర్ ఐజి సుందరరాజ్ ప్రకటనను దేశ ప్రజలంతా ఖండించాలని పౌర ప్రజాసంఘాల వేదిక కోరింది. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణ మూర్తి, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి, న్యాయవాది పద్మ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, పౌర ప్రజాసంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వ హత్యాకాండను ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. చర్చలతో శత్రుదేశాలతో యుద్ధాలనే ఆపేస్తున్న కేంద్ర ప్రభుత్వం, స్వదేశీయులతో చర్యలకు ఎందుకు సంసిద్ధం కావడం లేదని ప్రశ్నించారు.

హైడ్రోపై ముందుకెళ్లొద్దు

(మొదటి పేజీ తరువాయి..)

తెలిపారు. ఆ ప్రాజెక్టులకు అనుమతులిస్తూ జారీ చేసిన జిఓ 51ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తీర్మానం కోసం పట్టుబట్టారు. ఆయన గళానికి సహచర జెడ్‌పిటిసిల గళమూ తోడైంది. దీంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర స్పందిస్తూ ప్రాజెక్టుల అనుమతులు రద్దు కోసం తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అల్లూరి కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ సమాధానమిస్తూ అన్ని విషయాలనూ పరిగణలోకి తీసుకొని గ్రామ సభలు నిర్వహించి, తీర్మానాలు చేసిన తర్వాత మాత్రమే ముందుకు వెళ్తామన్నారు. ఈ సమావేశంలో స్థానిక సమస్యలపైనా చర్చ సాగింది. వైసిపి సభ్యుల మధ్య విభేదాలు బయటపడ్డాయి.

సమావేశం ఎలా నడిచిందంటే..

జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి విశాఖ, అనకాపల్లి, ఎఎస్‌ఆర్ జిల్లాల కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్, దినేష్ కుమార్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, రేగం మత్స్యలింగం, డిసిసిబి ఛైర్మన్ కోన తాతారావుతో పాటు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు హాజరయ్యారు. అయితే సమావేశానికి వచ్చిన వైసిపి జెడ్‌పిటిసిలు 22 మంది సమావేశాన్ని తొలుత బహిష్కరించారు. దీంతో కోరం సరిపోలేదు. కోరం సరిపోయే వరకు వేచి ఉండి జెడ్‌పి ఛైర్‌పర్సన్ సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా వ్యవసాయం, ఇరిగేషన్, విద్యుత్, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, ఇంజినీరింగ్ తదితర శాఖలపై చర్చ, సమీక్ష నిర్వహించారు.

అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ ఏజెన్సీలో అదానీ, నవయుగ కంపెనీలకు అనుమతులు ఇచ్చిన హైడ్రోపవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని, ఈ మేరకు పరిషత్ సమావేశంలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. గత నెల 30న జిఓ 51ని తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో మూడు హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిందన్నారు. స్థానిక ఆదివాసీలను సంప్రదించకుండా ఏకపక్షంగా అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘించి నిర్ణయాలు చేయరాదన్నారు. తక్షణం ఆ జిఒను వెనక్కి తీసుకొని, ప్రయివేటు కంపెనీలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలన్నారు. ఈ మేరకు పోడియం వద్ద నిరసన తెలిపి ఛైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం కూడా సమర్పించారు. ఆదివాసీలు నీటి అవసరాల కోసం అక్కడి వాగుల మీదనే ఆధారపడతారని చెప్పారు. ప్రాజెక్టు కోసం వాగుల నుంచి నీటిని తరలించడంతో మానవ హక్కులకు భంగం కలుగుతుందన్నారు. అనంతగిరి మండలంలోని చిట్టెంపాడు, గుజ్జెలి ప్రాంతాలలో గ్రామసభల అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ సర్వేలను నిలుపుదల చేయాలన్నారు. అనకాపల్లి జిల్లాలోకి వచ్చే రైవాడ జలాశయంపై నిర్మించతలపెట్టిన హైడ్రో ప్రాజెక్టునూ గంగరాజు వ్యతిరేకించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన నాయకులు కార్పొరేట్ సంస్థలకు దాసోహం పలకడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని పున్ణ పరిశీలన చేయకుండా అదే అదానీ కంపెనీకి తిరిగి దాసోహం పలకడం గర్హనీయమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పాఠశాలల నిర్వహణ దారుణంగా ఉందని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరని, తక్షణం ఆ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు.

ప్రజలకు అధికారులు మెరుగైన సేవలందించాలి

అధికారులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, గిరిజన ప్రాంతాల నుంచి కెజిహెచ్‌కు వచ్చే రోగులకు సరైన సదుపాయాలు కల్పించాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర వైద్యాధికారులు కోరారు. సభ ప్రారంభమైన వెంటనే స్థాయీ సంఘ సమావేశాలు, సర్వ సభ్య సమావేశాలు వేరు వేరుగా నిర్వహించాలని పలువురు సభ్యులు కోరగా వేరు వేరుగా నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ స్థాయీ సంఘ సమావేశాలలో ఆమోదం పొందిన అంశాలను సర్వ సభ్య సమావేశంలో ప్రవేశపెట్టాలని సూచించారు. వ్యవసాయంపై సమీక్షలో ఉచిత విత్తనాలు అందించాలని, విత్తనాలు ఎంపికపై రైతులకు అవగాహన కల్పించాలని, అన్నదాత సుఖీభవ, క్రాప్ ఇన్సూరెన్స్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే బండారు, పలువురు సభ్యులు అధికారులను కోరారు. రైతులందరికీ సరిపడే విత్తనాలు ఉన్నాయని అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖాధికారి వివరించారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ తీరు మారకుంటే 'అవిశ్వాసం' పెడతాం

సమావేశాన్ని బహిష్కరించిన వైసిపి రోలుగుంట జెడ్‌పిటిసి పోతల శ్రీను, చీడికాడ జెడ్‌పిటిసి లాలం జానకిరామ్, మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, చోడవరం జెడ్‌పిటిసి శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర తమ పార్టీకి చెందిన వారేనని, తామంతా ఎన్నుకుంటేనే ఆమె ఆ స్థానంలో కూర్చున్నారని చెప్పారు. అయితే కొన్ని మాసాలుగా ఆమె జెడ్‌పిటిసి సభ్యులుగా తమకు వస్తున్న అభివృద్ధి నిధులను మంజూరు కాకుండా, ఖర్చు కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అదే సందర్భంలో కొందరికి నిధులు సమకూరుస్తూ వారి ప్రాంతాలలో పనులు జరిగేలా చూస్తున్నారని తెలిపారు. తమను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. రెండేళ్లుగా తమకు గౌరవ వేతనం కూడా చెల్లించటం లేదన్నారు. సాధారణ నిధులనుంచి గౌరవ వేతనం చెల్లించడానికి వెసులుబాటు ఉన్నప్పటికీ, ఆ దిశగా ఆమె ప్రయత్నం చేయటం లేదని విమర్శించారు. వెంటనే మార్పు రావాలని తాము కోరుకుంటున్నామని, అలా కాకపోతే ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూడా తాము వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.

టాటా మోటార్స్ 'ఏస్ ప్రో' ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కార్గో మొబిలిటీలో కొత్త మైలురాయిని సృష్టిస్తూ, దేశ అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారు టాటా మోటార్స్ సరికొత్త టాటా ఏస్ ప్రోను ప్రారంభించిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీష్ వాఘ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, కేవలం రూ.3.99 లక్షల సాటిలేని ప్రారంభ ధరతో పెట్రోల్, రెండు రకాల ఇంధనం,ఎలక్ట్రిక్ వేరియంట్లలో టాటా ఏస్ ప్రో లభిస్తుందన్నారు. టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ విభాగ హెడ్ పినాకి హల్దార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విఎంఆర్‌డిఎ సేవలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాళ్లను ఇకనుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చని సంస్థ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ తెలిపారు. బుధవారం విఎంఆర్‌డిఎ బాలల థియేటర్‌లో ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, విఎంఆర్‌డిఎ సేవలు పారదర్శకంగా ఉండాలనే సంకల్పంతో ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్' మురళికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మురళి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ.: పెదవాల్తేరులో జివిఎంసిఆధ్వర్యంలో నడుస్తున్న రెడ్‌క్రాస్ హోంలెస్ షెల్టర్ మేనేజర్ ఆవాల మురళీకి అరుదైన పురస్కారం దక్కింది. మానసిక, శారీరక రోగులు, దివ్యాంగులు, అనాథలను అక్కున చేర్చుకుని వారిని హోంలెస్ షెల్టర్‌కు తరలించి ఆదుకోవడంతోపాటు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించి, మానవతా విలువలతో కూడిన సేవలు సేవలు అందిస్తున్న మురళీకి ఎపి రెడ్‌క్రాస్ పురస్కారాన్ని ప్రకటించగా, బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రెడ్‌క్రాస్ సొసైటీ ఆరో వార్షికోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి అవార్డును స్వీకరించారు.తెలంగాణ, కరీంనగర్.జిల్లా కొండపాక .గ్రామానికి చెందిన మురళీ కొన్నాళ్లుగా విశాఖలో పనిచేస్తున్నారు. మురళీకి రెడ్‌క్రాస్ పురస్కారం దక్కడంపై ఆయన స్నేహితులు, కుటుంబసభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : వెల్లంకి 33/11 కెవి. సబ్‌స్టేషన్ పరిధి బొడ్డపాలెం, వెల్లంకి రూరల్, వెల్లంకి ఇండస్ట్రియల్ ఫీడర్లపై నిర్వహణ, చెట్ల తొలగింపు పనుల నేపథ్యంలో బొడ్డపాలెం, వెల్లంకి, గారిపేట, వెల్లంకి-2, మన్యాలపేట, అప్పన్న కాలనీ తదితర ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఎఇ మండల అప్పలనాయుడు తెలిపారు. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దివాకర్‌కు నివాళి

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి పిఆర్‌ఒ, సీనియర్ జర్నలిస్టు పైలా దివాకర్‌కు తాటిచెట్లపాలెంలోని ఆయన స్వగృహంలో పలువురు బుధవారం నివాళులర్పించారు. దివాకర్ సంస్మరణసభను బుధవారం ఆయన స్వగృహంలో ఏర్పాటుచేశారు. ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివాకర్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శరగడం చిన్న అప్పలనాయుడు, జాన్ వెస్లీ, అనిల్ రాజు, ముమ్మన సురేష్, పితల గోవింద్, కిరణ్ రాజు, ఎమ్‌డి షరీఫ్, పైడి రమణ, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నేడు విజయరామరాజు సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి- పద్మనాభం : విజయనగరం మహారాజు రెండవ విజయరామరాజు సంస్మరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదలైంది. పద్మనాభం గ్రామంలో 1892 జులై 10న బ్రిటిష్ సైన్యానికి, విజయనగరం మహారాజు సైన్యానికి జరిగిన పద్మనాభ యుద్ధంలో విజయనగరం మహారాజు రెండవ విజయరామరాజు మృతి చెందిన కారణంగా ఆ సమాధి వద్ద ఏటా శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు.

ఘనంగా ఎంపిపి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం మండల పరిషత్ అధ్యక్షులు కె.రాంబాబు పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు రాంబాబు ఇంటికి చేరుకొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

కంప్యూటర్, ప్రింటర్ అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ గ్రామ సచివాలయానికి అవసరమైన రూ.71,500 విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను చిప్పాడ దివీస్ యాజమాన్యం బుధవారం అందజేసింది. పంచాయతీ కార్యదర్శి పి.రామారావుకు దివీస్ సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పలువురు పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న సిఎస్ఆర్ ప్రతినిధులు

త్వరలో ఇసాయ్‌ఫార్మా జిసిసి ఏర్పాటు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రముఖ ఔషధ పరిశ్రమ ఇసాయ్ ఫార్మా త్వరలో విశాఖ కేంద్రంగా గ్లోబల్ కేపబిలిటి సెంటర్ (జిసిసి)ను ఏర్పాటుచేయనుందని ఇసాయ్ ఫార్మా అంతర్జాతీయ ప్రతినిధి (గ్లోబల్ సిఐఒ) మకోటో హోకెట్స్ తెలిపారు. ఇసాయ్ ఫార్మా ప్రతినిధి బృందంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, ప్రో వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మకోటో హోకెట్స్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఔషధ రంగంలో మార్పు దిశగా తమ సంస్థ ప్రణాళికలు రూపొందించిందని, అందులో భాగంగానే విశాఖలో గ్లోబల్ కేపబిలిటి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీనికి అవసరమైన మానవ వనరులు, పరిశోధన సహకారానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఔషధ పరిశ్రమల రంగానికి అవసరమైన విధంగా గీతం సహకారం తీసుకుంటామని తెలిపారు.




గీతం ప్రతినిధులతో సమావేశమైన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రతినిధులు

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో విశాఖలో టిసిఎస్, క్యాప్‌జెమిని, గూగుల్ వంటి సంస్థలు త్వరలో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయని తెలిపారు. ఇసాయ్ ఫార్మా జిసిసి ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణ కాగలదని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో గీతం సీనియర్ ప్రొఫెసర్లు అరుణ్ కుమార్, శాంతి చిలుకూరి, భరణి చంద్రకుమార్, కె.వి.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆడారి తులసీరావు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -పెందుర్తి : పెందుర్తిలోని విశాఖ మిల్క్ బల్క్ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన ఆడారి తులసీరావు విగ్రహాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి తదితరులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆడారి అందించిన సేవలను నేతలు ప్రస్తుతించారు. రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి రైతు బాంధవుడిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆడారి తులసీరావు సమకాలికుడు లక్కవరపుకోట డైరెక్టర్ కోళ్ల కాటమయ్యను అందరూ ఘనంగా సత్కరించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ సరగడం శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జోషి, బడేటి రవి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, మాజీ మార్కెట్ చైర్మన్ వేగి దివాకర్, నాయకులు డిబిఎల్.నాయుడు, కొరుపోలు రామానాయుడు, కరకదేవుడు, రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



ఆడారి తులసీరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0పై శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులకు గ్రామ పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0పై శిక్షణ బుధవారం నిర్వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఇంజినీరింగు సహాయకులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ ఎంపిడిఒ పి.మీనాకుమారి, మండల ఎఒ జి.జయఉమ అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు.

కొత్తపాలెం పిఎసిఎస్ చైర్మన్‌గా బొడ్డేటి విజయ్



బొడ్డేటి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-గోపాలపట్నం : కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్) కమిటీ చైర్మన్‌గా బొడ్డేటి విజయ్‌కుమార్, సభ్యులుగా కంపర ఆనంద్, గొన్నబత్తుల అప్పలరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బొడ్డేటి విజయ్‌కుమార్ తెలుగుదేశంపార్టీ 89వ వార్డు అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే గణబాబుకు అనుంగ శిష్యునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. గణబాబు విజయంలో కీలక పాత్ర పోషించిన విజయ్‌కుమార్‌కు సముచిత స్థానం లభించిందని కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అభినందించిన ఎమ్మెల్యే గణబాబు

కొత్తపాలెం ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యవర్గ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే గణబాబును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్‌ను, డైరెక్టర్లు కంపర ఆనంద్‌ను, గొన్నబత్తుల అప్పలరాజును ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం గణబాబును నూతన సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రమణ, తెలుగుదేశం నాయకులు అయితంశెట్టి గోపి, దాడి సురేష్, గవ్వ భాస్కర్, శరగడం రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందపురం తహశీల్దార్‌గా శ్రీనుబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం తహశీల్దార్‌గా సూరిశెట్టి శ్రీనుబాబు బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో భీమిలి మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా మూడేళ్ళ విధులు నిర్వహించిన ఆయన ప్రమోషన్‌పై ఆనందపురం తహశీల్దార్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనుబాబుకు రెవెన్యూ శాఖ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్ చైతన్య కుమార్, ఆర్ఐ అవినాష్, విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనుబాబుకు విశాఖ విఆర్ఒ సంఘం జిల్లా అధ్యక్షుడు పోతిన వెంకట అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ కోడూరు అప్పారావు, ట్రెజరర్ వరలక్ష్మి తదితరులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు.

గిరి ప్రదక్షిణలో సేవా కార్యక్రమాలు



మజ్జిగను పంపిణీచేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

గిరి ప్రదక్షిణను పురస్కరించుకొని ఆ మార్గంలో పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, ప్రజా సంఘాలు సేవా కార్యక్రమాలు చేపట్టాయి. తాగునీరు, పులిహోర, మజ్జిగ, పండ్లు తదితరాలను భక్తులకు పంపిణీచేశారు.

సీతమ్మధార : సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే-అవుట్, తాటిచెట్లపాలెం, కైలాసపురం తదితర ప్రాంతాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు అరటి పండ్లు, మంచినీరు, మజ్జిగ, పులిహోర, మందులు భక్తులకు అందజేశారు. మాధవధార యువజన సమాజం వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన మజ్జిగ పంపిణీని కూన వెంకట్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్ రాజు,ఉపాధ్యక్షులు శ్రావణ్, నాయకులు రాంగోపాల్, జ్యోత్స్న, గుణ, అజయ్, తదితరులు పాల్గొన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు ఆధ్వర్యాన సీతమ్మధారలోని సిరి వెంకటేశ్వర డెవలపర్స్ వద్ద పండ్లు, పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆదేశాల మేరకు శ్యామల దీపిక ఆధ్వర్యాన శీతల పానీయాలు, తాగునీరు, పులిహోర అందజేశారు.

ఆరిలోవ : గిరి ప్రదక్షిణ నేపథ్యంలో హనుమంతువాక నుంచి అడవివరం వైపు వెళ్లే బిఆర్‌టిఎస్ రహదారి కిటకిట లాడింది. హనుమంతువాక నుంచి అడివివరం మధ్యలో గిరి భక్తుల కోసం ప్రసాదాలు, అల్పాహారం, భోజనం అందించడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించారు. కేవలం స్వచ్ఛంద సంస్థలే కాకుండా ఈ ఏడాది ప్రభుత్వ రంగ సంస్థలు కూడా స్టాల్స్‌ను ఏర్పాటుచేసి భక్తులకు సేవలు అందించాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఎపిఈపిడిసిఎల్ జోన్ 3, సిహెచలం దేవస్థానం, ఆరిలోవ ప్రెస్ క్లబ్, గోశాల, ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్, విశ్వాస్ సంస్థ, అక్షయ ఆశ్రయ సంఘం, అయ్యప్ప కాంట్రాక్టర్స్, వివిధ దేవాలయాల ట్రస్టులు ఆహారం సమకూర్చాయి. హెల్త్‌సిటీలోని వివిధ ఆసుపత్రులు వైద్య సేవలు అందించాయి.

ప్రభుత్వ, ప్రయివేటు సమన్వయంతో వైద్య శిబిరాలు

సీతమ్మధార : ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల సమన్వయంతో వైద్యశిబిరాలు, అంబులెన్స్‌లు ఏర్పాటుచేసినట్లు డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతం మొత్తంలో 32 పాయింట్లను గుర్తించి ఆ ప్రాంతాలకు 23 అంబులెన్స్‌లను అనుసంధానం చేసి వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. ఉచిత వైద్య శిబిరాల్లో ఎక్కువగా ఒఆర్ఎస్, పాకెట్లు, రక్తపోటు, మధుమేహం, నొప్పి నివారణ మందులను అధిక సంఖ్యలో వినియోగించుకున్నారని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణలో విశ్రాంత ఉద్యోగి

పెందుర్తి : ఎన్ఎడి నుండి వేపగుంట వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడంతో నాయుడుతోట కూడలిలో విశ్రాంత ఉద్యోగి బాలాజీ హోటల్ అధినేత రాము సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 8 వరకు ట్రాఫిక్ నియంత్రణకు తన వంతు కృషి చేశారు.

పద్మనాభం మండలం నుంచి తరలిన భక్తులు

పద్మనాభం : గిరి ప్రదక్షిణకు పద్మనాభం మండలంలోని పలు గ్రామాల నుంచి మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. దీంతో ఆయా గ్రామాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. విజయనగరం నుంచి సింహాచలం రోడ్డు ఉదయం 10 గంటల నుండి వాహనాలు రాకపోకలతో రద్దీగా మారింది.

ట్రాఫిక్ ఆంక్షలతో భక్తుల ఇక్కట్లు..

ఆరిలోవ : శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా ప్రాంతాలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు ఎక్కువ మంది హనుమంతువాక మీదుగా తొలిపావంచాకు చేరుకుంటున్నారు. ఈ ఏడాది ముడసర్లోవ స్కిల్ డెవలప్‌మెంట్ వద్ద నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇక్కడ నుంచి అడివివరం మీదుగా చేరుకునేందుకు ఆటోలను, ద్విచక్రవాహనాలను అనుమతించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దేవస్థానం వేసిన బస్సులు చాలక పోవడంతో ద్విచక్రవాహనదారులు, ఆటోలు, కారుల్లో వచ్చిన వారు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సుమారు 7 కిలో మీటర్లు నడిచి, తిరిగి అదే మార్గంలో ఇటువైపు రావల్సి రావడంతో భక్తులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
గురువారం
10 జూలై 2025


అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మానవహారం



గాజువాకలో కార్మికుల భారీ ర్యాలీ



తగరపువలసలో సమ్మె ర్యాలీలో మాట్లాడుతున్న గంగారావు


నర్సీపట్నంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

సార్వత్రిక సమ్మె జయప్రదం!

కేంద్రంలోని బిజెపి నేతృత్వం ఎన్‌డిఎ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ రద్దు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత కార్మికసంఘాల పిలుపుమేరకు బుధవారం దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. పలురంగాల కార్మికులు విధులను బహిష్కరించి నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు, మానవహారాలు ఇతరత్రా రూపాల్లో నిరసనలు చేపట్టారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

నక్కపల్లి: కార్మిక సంఘాలు ఇచ్చిన గెలుపు మేరకు నక్కపల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన సమ్మె జయప్రదం అయ్యింది. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గారాణి నాయకత్వంలో కార్మికులు, స్కీం వర్కర్లు నక్కపల్లి నూకాలమ్మ తల్లి ఆలయం నుండి జాతీయ రహదారి గుండా భారీ ర్యాలీ చేపట్టారు. రైతు మెడకు ఉరితాడు, కార్మిక చట్టాలకు సంకెళ్లు కళారూపాలు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రాజేష్, ఎం.దుర్గారాణి, లక్ష్మీ రాజ్యం, సుబ్బలక్ష్మి, లోవరాజు, తులసీ, వరలక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కోటవురట్ల: మాకవరపాలెం మండల కేంద్రంలో స్కీం వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించారు, స్కీము వర్కర్లు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: సిఐటియు అద్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుండి ర్యాలీగా శ్రీ కన్య కూడలి చేరుకుని మానవహారం ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి. కొటేశ్వరరావు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతాంగాన్ని పంటించుకోలేదన్నారు. పని గంటల పెంపుతో కార్మికులు మరింత ఇబ్బంది పడతారన్నారు. అంగన్ వాడీ కార్యకర్తలకు యాప్‌లతో బారం పెంచుతున్నారని విమర్శించారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని తెలిపారు.ముఠా, భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ. సంక్షేమ పథకాలును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు యూనియన్ రిజనల్ నాయకులు పి. సాయికిరణ్, గిరిజన ఉద్యోగల సంఘం జిల్లా అద్యక్షులు పి.ధనార్జన్, ఎల్ఐసి బ్రాంచ్ యూనియన్ నాయకులు కెకెబి పడాల్, ఎజెంట్ల ఆసోసియేషన్ నాయకలు వి. శ్రీరాంముర్తి, ఎస్ డబ్ల్యూ ఎఫ్ జిల్లా అధ్యక్షలు యూకె రావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వి సామ్రాజ్యం, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు

కోటవురట్ల: మండలంకేంద్రంలో స్కీం వర్కర్లు ర్యాలీ నిర్వహించారు.ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించారు.

చీడికాడ: చీడికాడలో ప్రజా సంఘాలు అద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నేత ఆర్.దేముడు నాయుడు మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఉద్యోగులు సంఘం నాయకులు బి.నాగరాజు, అంగన్వాడి యూనియన్ రాజులమ్మ, ఆశ వర్కర్ యూనియన్ కామాక్షి కొండమ్మ, మధ్యాహ్నం భోజనం వర్కర్స్ లక్ష్మి, వరలక్ష్మి, రమణమ్మ, వెలుగు వివోఏలు సూరిబాబు, అప్పలనాయుడు, వీఆర్ఏ నాగేష్ పాల్గొన్నారు.

గొలుగొండ: గొలుగొండలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కన్నబాబు, ప్రెసిడెంట్ సిహెచ్ఎస్.భ్రమరాంబ, కార్యదర్శి ఎం.మంగ, ఆశా నాయకులు కె.మాతమ్మ, కె.చిట్టెమ్మ, ఎం.కుమారి, ఆర్.సత్య, కె.వెంకయ్యమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్డిఓ కార్యాలయం నుండి ర్యాలీగా శ్రీ కన్య కూడలికి వెళ్లి నిరసన చేట్టారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, కార్మికులకు గుర్తించి కనీస వేతనం 26,000 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నర్సీపట్నం నియోజవర్గం మండల కార్యదర్శిలు జి.గురుబాబు, కె.లక్ష్మి, రాధాకృష్ణ, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, అంకంరెడ్డి చిన్ననాయుడు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పాయకరావుపేటలో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మెలో అంగన్వాడీ, ఆశా, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని పాండురంగ స్వామి దేవస్థానం నుంచి వై జంక్షన్ వరకూ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా సిఐటియు నాయకులు బత్తిన నాగేశ్వరరావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకున్న లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు యూనియన్ నాయకురాలు ఎమ్ తులసి, కె.నూకరత్నం, కె.పరంజ్యోతి, పి.సత్యవేణి, ఆశా వర్కర్లు డి.భవానీ, జి.దుర్గ, కృపాదేవి తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: మండల కేంద్రంలో సిఐటియు మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన సమ్మె విజయవంతం అయ్యింది. ఈ కార్యక్రమంలో అంగనవాడి ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.సత్యవేణి, మధ్యాహ్నం భోజనం కార్మికుల అధ్యక్షురాలు ఎస్. అమ్మాజీ, వివోఎల సంఘం నాయకులు పుష్ప, ముఠా కార్మికుల నాయకులు ధనంజయరావు, కే.గోవింద్ పలువురు పాల్గొన్నారు.

రోలుగుంట: సిఐటియూ ఆధ్వర్యంలో రోలుగుంటలో సమ్మె చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్లు, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం ఐకెపి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు

నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ ఆధ్వర్యాన అనకాపల్లి జిల్లా విద్యుత్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. జేఏసీ నాయకులు అనకాపల్లి నూకరాజు, పి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులు..

స్థానిక యూనియన్ బ్యాంక్ ఉడ్ పేట శాఖ దగ్గర బ్యాంకు ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధానాలను నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో బ్యాంకు యూనియన్ నాయకలు కాండ్రేగుల హరికృష్ణ, శరగడం శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ఏపీడబ్ల్యూజేఎఫ్ సంఘీభావం

అనకాపల్లి : దేశ వ్యాప్త కార్మిక సమ్మెకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంపూర్ణ సంఘీభావం తెలియజేసింది. అనకాపల్లిలో సీఐటీయూ, కార్మిక సంఘాలతో కలిసి జర్నలిస్టులు బుధవారం ఆర్‌డివో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు భీమరశెట్టి వెంకటేష్ శశి, పి.నాగ, చాంద్ బాషా, ఎం.అజయ్ పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆధ్వర్యాన

అనకాపల్లి రూరల్ : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎఐటియుసి ఆధ్వర్యాన సిపిఐ కార్యాలయం నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, మెయిన్ రోడ్డుపై మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజాన దొరబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడారు.

మండలాల్లో...

కశింకోట : కశింకోటలో సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించి, తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐద్వా, సిఐటియు, వివిధ సంఘాల నేతలు డిడి.వరలక్ష్మి, దాకారపు శ్రీనివాసరావు, టి తనుజ, ఎం.శ్రీదేవి, పిఎన్‌వి పరమేశ్వరరావు, జి కొండబాబు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం ఎమ్మార్వో కార్యాలయం నుండి కొత్తూరు జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా పాత బస్టాండ్ సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు, పిఎసిఎస్, పలు సంఘాల నాయకులు వివి శ్రీనివాసరావు, గూనూరు వరలక్ష్మి, కళ్యాణ్, మోహన్, బి.రామలక్ష్మి, కొండమ్మ, ఆర్.బుచ్చి రాజమ్మ, దేవి, జగన్మోహన్ రావు, నర్సింగ రావు, నాగిరెడ్డి సత్యనారాయణ, దేవుళ్ళు పాల్గొన్నారు.

దేవరాపల్లి : సిఐటియు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యాన దేవరాపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయా సంఘాలు, స్కీమ్ సంఘాల నాయకులు డి.వెంకన్న, కె.సూరి బాబు, బిటి.దొర, కనకరాజు, పద్మ, కమల, జి.రాము, సిహెచ్ లక్ష్మణ, యం గంగాధర్ పాల్గొన్నారు.

మునగపాక : మునగపాక మెయిన్ రోడ్డులో సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు, పార్వతి, ప్రకాష్, రామలక్ష్మి, టెక్కలి జగ్గారావు, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, వివోఏ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సబ్బవరం : సిఐటియు ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లు స్థానిక పిహెచ్‌సి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, స్కీమ్ సంఘాల నాయకులు ఉప్పాడ సత్యవతి, వివి రమణమ్మ, ఎస్.గౌరీ, వరలక్ష్మి, మొల్లేటి గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక అంగన్వాడీ, ఆశ వర్కర్స్, మధ్యాహ్నం భోజనం, పంచాయతీ కార్మికులు, కోపరేటివ్ ఎంప్లాయిస్, రైతులు, చేతివృత్తిదారులు సమ్మె చేసి, ర్యాలీ చేపట్టారు. స్థానిక మూడు రోడ్ల జంక్షన్లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు, ఇతర సంఘాల నేతలు ఈర్లే నాయుడు బాబు, గండి నాయనబాబు, జి కుమారి, ఎన్.కుమారి, నాగరాజు, గండి జగ్గమ్మ, రొంగలిఈశ్వరరావు, ఈర్లే రామనాయుడు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా, అంగన్వాడీ, సహకార సంఘాల సిబ్బంది సిఐటియు ప్రతినిధులు ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. సిఐటియు నాయకులు ఎస్బిఐ నాయుడు, పిన పత్రుని సాంబశివరావు, ప్రేమ్ చంద్రశేఖర్, వరలక్ష్మి పాల్గొన్నారు.



సమ్మెలో ఆకట్టుకుంటున్న వినూత్న కళారూపాలు

పారిశ్రామిక వాడల్లో..

రాంబిల్లి : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రాంబిల్లి మండలంలోని ఎన్ఏఓబి మెయిన్ గేట్ సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రాంబిల్లి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవ హారం చేపట్టారు. కార్య క్రమంలో సిఐటియు, ఐద్వా నాయకులు జి.దేముడు నాయుడు, చంద్రక రామకృష్ణ, సిహెచ్. మంగతాయారు, ఎస్ఇజెడ్, ఎన్ఎఓబి కార్మికులు, స్కీమ్ వర్కర్లు, వివిధ రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని లంకెలపాలెం జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం, నేతలు గనిశెట్టి సత్యనారాయణ బద్ధపు శ్రీనివాసరావు, కేపోతి నాయుడు పాల్గొన్నారు. పరవాడ సబ్ స్టేషన్ జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు, ఐద్వా, స్కీమ్ సంఘాల నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వివి.రమణ, పి.మాణిక్యం, రత్నం, ఎ.వరలక్ష్మి, కె.విమల, ఎస్.వెంకటలక్ష్మి, సన్నిబాబు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీలో సిఐటియు, ఐఎన్‌టిసి ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె చేసి, భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాల సూర్య, పిపి నాయుడు, ఐఎన్టీయూసీ పి.పెంటారెడ్డి రామారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురంలో సిఐటియు, ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన కార్మికులు, కర్షకులు ఉద్యోగులు, ర్యాలీ నిర్వహించి, జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఆర్.రాము, కె.సోమునాయుడు, కె.రామసదాశివరావు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు ఎస్ కన్మనాయుడు, విశ్వేశ్వరరావు, నారాయణమ్మ సత్తిబాబు నాగేశ్వరరావు కార్మికులు పాల్గొన్నారు.

తగరపువలస : సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యాన చిట్టివలస సిఐటియు కార్యాలయం నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. జ్యూట్ కార్మిక వాడ మీదుగా జంక్షన్, భీమిలి రోడ్డు, గొల్ల వీధి, గ్రంథాలయం వీధి, వై జంక్షన్, మెయిన్ రోడ్డు, రాములమ్మ థియేటర్ మీదుగా ర్యాలీ జంక్షన్‌కు చేరింది. అనంతరం మానవహారం నిర్మించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నెలకు కనీస పింఛను రూ.9 వేలు అందించాలని ర్యాలీ ఆద్యంతం నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డాక్టర్ బి.గంగారావు, ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు మాట్లాడారు.

ఎఐటియుసి ఆధ్వర్యాన తగరపువలసలోని జిఆర్.భవన్ వద్ద ర్యాలీ, మానవ హారం నిర్మించారు. ఈ కార్యక్రమంలో కొండపు ఈశ్వరరావు, సిహెచ్ రాంపైడి, పడాల గోవింద్ పాల్గొన్నారు.

మధురవాడ, కొమ్మాది : మధురవాడ పరిధి కొమ్మాదిలోని చైతన్య టెక్నో స్కూల్ కూడలి నుంచి పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం వరకు విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన ఆటోలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రాజుకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.చిన్నారావు, పి.చిన్న, అవతార్‌సింగ్, బి.నాగేశ్వరావు, శంకర్, కె.రాము, ఉమ, డి.రవి, ఎస్.ప్రసాద్, డి.సూరిబాబు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం గ్రామంలో బ్యాంకులు, పాఠశాలలు మూసివేశారు. తగరపువలసలో జరిగిన ధర్నాకు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మికులు పెద్దఎత్తున తరలి వెళ్లారు.

గాజువాక : గాజువాక, ఆటోనగర్, రైల్వే వేగన్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పాత గాజువాక నుండి కొత్త గాజువాక వరకు తిరిగి పాత గాజువాక వరకు ర్యాలీ చేపట్టారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీలో కార్మికులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ, లోకేష్, కిరీటం, నమ్మి రమణ, గొలగాని అప్పారావు, బంగారు నాయుడు, సంతోషం, నాగరాజు, గణేష్ పాల్గొన్నారు.


పరవాడ ఎన్‌టిపిసి వద్ద సిఐటియు, ఐఎన్‌టియుసి ఆధ్వర్యాన సమ్మెలో కార్మికులు



అనకాపల్లిలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ర్యాలీ



చోడవరంలో కార్మికుల ర్యాలీ



సబ్బవరంలో అంగన్వాడీలు, ఆశాల నిరసన



కశింకోటలో ర్యాలీలో పాల్గొన్న అంగన్వాడీలు, ఆశాలు, ఇతర కార్మికులు



అనకాపల్లిలో జర్నలిస్ట్‌ల నిరసన



రాంబిల్లిలో సమ్మెలో పాల్గొన్న కార్మికులు


అచ్యుతాపురంలో కార్మికుల వినూత్న నిరసన



అనకాపల్లిలో సమ్మెలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు



మధురవాడలో సమ్మెలో పాల్గొన్న ముఠా కార్మికులు



నక్కపల్లిలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన నినాదాలు చేస్తున్న కార్మికులు


గొలుగొండలో సమ్మెలో ఆశాలు, అంగన్వాడీలు


దేవరాపల్లిలో మానవహారంలో మాట్లాడుతున్న వ్యకాసం నేత వెంకన్న



వడ్డాదిలో కార్మికుల నిరసన ర్యాలీ


రోలుగుంటలో అంగన్వాడీలు, ఆశాల నిరసన

శారద నదిలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండలం జన్నవరం గ్రామం వద్ద శారద నదులో మునిగిపోయి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రామానికి చెందిన సిహెచ్.సన్యాసిరావు (35) జన్నవరం గ్రామంలో చనిపోయిన ఓ వ్యక్తి దహన సంస్కారాలకు వచ్చారు. అనంతరం శారద నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రిస్క్యూ టీమ్ వచ్చి గాలించి సన్యాసిరావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సిఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో టీ కొట్టు దగ్ధం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో మంగళవారం రాత్రి ద్వారపురెడ్డి ఆదినారాయణకి చెందిన టీ కొట్టు పాక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకొని దగ్ధమైంది. అగ్ని ప్రమాదం సమాచారం అందించడంతో అనకాపల్లి అగ్ని మాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పారు. పాకలో ఉన్న సామగ్రి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.25 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. అర్జవేశారు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆదినారాయణ కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆసకపల్లి పంచాయతీ శివారు ఎరుకునాయుడుపాలెం గ్రామానికి చెందిన రాపర్తి త్రినాథ్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివాడు. త్రినాథ్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు బుధవారం జరిగిన రాపర్తి త్రినాథ్ సంతాపసభకు విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు సేకరించిన రూ.36వేలు త్రినాథ్ భార్యకు అందజేశారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

ప్రజాశక్తి -మునగపాక అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఏ ప్రాంతాలలోనైనా గుర్తింపు ఉంటుందని మండలంలోని వాడ్రాపల్లి సర్పంచ్ కాంగ్రేసుల నూకరాజు అన్నారు. వాడ్రాపల్లి గ్రామ సచివాలయ సిబ్బంది బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బదిలీ సిబ్బందికి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మల్ల శేషు, కాంగ్రేసుల లక్ష్మణరావు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2025-26కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారిణి ఎస్. మంజులవాణి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా యాక్షన్ ప్లాన్ రూపొందించి, అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు, జడ్పిటిసి సభ్యుడు కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాద సింహాచలం నాయుడు, ఉగ్రోకుల గంగాభవాని, కార్యాలయ పరిపాలనాధికారి డివి లక్ష్మీనారాయణ, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహాల ప్రతిష్టకు విరాళం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కొత్తూరు సింహబలుడు కొండపై దాతల సహకారంతో నిర్మిస్తున్న సీతారామాలయంలో సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి రాతి విగ్రహాల ప్రతిష్టకు స్థానిక భక్తులు రాజాన రాజారావు, ఉమా వెంకటలక్ష్మి రూ.2.20 లక్షలు విరాళం ప్రకటించారు. వారి కుమారులు శ్రీకాంత్, లక్ష్మి, శివ లావణ్య దంపతులు తమ సొంత నిధులతో ఆలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.50 వేల నగదు అందించారు. విరాళ దాతలను కమిటీ సభ్యులు ప్రత్యేకంగా సత్కరించారు.

కన్నుల పండుగగా తోటాడ గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తోటాడ ఆదినారాయణస్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ మహోత్సవాల్లో భాగంగా బుధవారం గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఇక్కడి ఓంకార పీఠం వద్ద ప్రారంభమై త్రిమూర్తుల ఆలయం, పాటిపల్లి కోలని, వరాహలక్ష్మీ నృసింహస్వామి ఆలయం, కాకరాపల్లి, నారాయుడుపాలెం గ్రామాల మీదుగా తిరిగి ఓంకార పీఠం వరకు ప్రదక్షిణ కొనసాగింది. తోటాడ పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చారు.

840 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన నిందితులు, గంజాయితో ఎస్పి, పోలీసు అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అక్రమంగా గంజాయిని తరలిస్తున్న 42 లక్షల రూపాయల విలువచేసే 840 కేజీల గంజాయిని నక్కపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా కేసు వివరాలను వెల్లడించారు. నక్కపల్లి ఇన్‌స్పెక్టర్ కె.కుమారస్వామి, ఎస్సై కె.సన్నిబాబు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 840 కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయిని, ఒక బొలెరో వాహనం, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. చింతపల్లి మండలం మామిడి పాలెం గ్రామానికి చెందిన సుక్రీ అర్జున్, దేగల పాలెం గ్రామానికి చెందిన వంతల సురేష్, రోలుగుంట మండలం పెద్దపేట గ్రామానికి చెందిన కొడమ నాగరాజు, గొలుగొండ మండలం ఏటి గైరంపేటకు చెందిన కైసర్ల దివాకర్, నక్కపల్లి మండలం ఉప్మాక పంచాయతీకి చెందిన ఎలమంచిలి రమణ ఒరిస్సాలోని జనబ ప్రాంతంలో గంజాయిని కొని అక్కడ ఉయ్యాల బ్రిడ్జ్ వద్ద బొలెరో వాహనంలో మొత్తం 840 కేజీల గంజాయిని, 20 బస్తాలతో లోడ్ చేశారు. అక్కడ నుంచి ధారకొండ, చింతపల్లి మీదగా డౌనూరు తీసుకువచ్చి, డౌనూరు చెక్ పోస్ట్‌కు ముందు పోలీస్ వారికి దొరకకుండా మనుషులతో తోటలలో ఉన్న కాలిబాట ద్వారా మోయించి మరలా డౌనూరు చెక్ పోస్ట్ దాటిన తరవాత మరలా బొలెరోలో లోడ్ చేయించారు. అక్కడ నుండి నర్సీపట్నం, తాళ్ళపాలెం మీదగా కర్ణాటకకు తీసుకువెళ్తుండగా నక్కపల్లి మండలం, వెదుళ్ళపాలెం జంక్షన్ వద్ద సదరు గంజాయిని, నలుగురు నిందితులను పట్టుకున్నట్లు ఎస్పి తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇతర నిందితులను కూడా పట్టుకోవడానికి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు బందాన్ని అభినందించి ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందజేశారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, నర్సీపట్నం డిఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, నక్కపల్లి సీఐ కె.కుమారస్వామి, ఎస్సై కె.సన్నిబాబు, నక్కపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'



ప్రజలతో మాట్లాడుతున్న చలపతిరావు, సాయికృష్ణ

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనకు తొలి అడుగు' పేరుతో బుధవారం జివిఎంసి మూడో వార్డు పరిధి నేరెళ్లవలస కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు కె.నాగరాజు, ఎం.సంజీవ్‌కుమార్, పి.నరసింగరావు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని అయినాడ, బిఆర్.తాళ్లవలస గ్రామాల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు కె.రమణ, జడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, పి.జగన్నాథం, పి.శ్రీనివాసరావు, గద్ద ప్రసాదు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, నాయకులు ఆడారి మంజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, దొక్కా నాగ భూషణం, ఆడారి జానకి, మహేష్, ఎంవిఆర్ నాయుడు, మోహన్, పొలమరశెట్టి రాజు, దాడి జగన్నాదరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని టిడిపి మండల అధ్యక్షులు కేరళ తులసీరామ్ అన్నారు. మండలంలో ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం గ్రామాలలో బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పతివాడ చిన్నయ్య నాయుడు, కాంగ్రేసుల అప్పారావు, కలం ప్రసాద్, కొలగాని శేసు, పీలా కాసుబాబు, గుడెల కనకారావు, బద్ది శ్రీను, కొలగాని శేషు, పిన్నమరాజు సైలెజ్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి ఎరకల కాలనీలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు వై.యేసుదాస్, నాయకులు పెద్దాడ వెంకటరమణ, పోతల పాత్రునాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కష్ణమూర్తి, అల్లు అబద్ధం, బండారు అప్పలనాయుడు, మాలి బాబు పాల్గొన్నారు.

'సంస్కృతి' విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పరవాడ : సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో తోటి విద్యార్థులతో ప్రజాస్వామ్యయుతంగా ఈ విద్యా సంవత్సరపు విద్యార్థి సంఘం నాయకులు బుధవారం ఎన్నికయ్యారు. హెడ్ బాయ్ ఆర్యన్ , హెడ్ గర్ల్ పవిత్ర, హౌస్ కెప్టెన్లు చరిస్మా, పూజిత, లోహిత, జ్ఞాపిక, సహాయకులు కరణ్ అగర్వాల్, శ్రీష్టిపర్మార్, ధైర్య పటేల్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, డైరెక్టర్ పి.ఉదయ నాగశ్రీ, ఉపాధ్యాయులు సోనశాంతి, రవి ప్రసాద్, సీఈవో కె.నిశాంత్ పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : సింహాచలం గిరి ప్రదక్షణకు విచ్చేసిన భక్త జనులకు మండలంలోని జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత ఆధ్వర్యంలో సుమారు 5000 మందికి పులిహోర ప్యాకెట్లు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రి 28వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : ఎన్‌టీపీసీ సింహాద్రి 28వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరవాడ ఎన్‌టిపిసి పరిపాలనా భవన సముదాయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ హెడ్ సమీర్ శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సంస్థ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఎన్‌టీపీసీ గీతాన్ని కార్యాచరణలో ఉన్న సిబ్బందితో కలిసి ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1997లో స్థాపించబడిన ఎన్‌టీపీసీ సింహాద్రి విద్యుత్ కేంద్రం ఎన్నో విజయాలను సాధించిందని తెలిపారు. తీర ప్రాంతానికి చేరువలో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రమని ఇది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణ చేసిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ

డెంగీ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 80వ వార్డు దేముడు తోట ప్రాంతంలో బుధవారం డెంగ్యూ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుంకరమెట్ట శ్రీసత్యనారాయణ స్వామి శ్రీసూర్యనారాయణ స్వామి వార్ల దేవస్థానం చైర్మన్, టీడీపీ వార్డు అధ్యక్షులు బొడ్డేడ మురళి, జనసేన పార్టీ అధ్యక్షులు సూరిశెట్టి రాముడు ఆధ్వర్యంలో డెంగ్యూ జ్వరాలపై అవగాహన సదస్సు జరిగింది. యుపిసిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జయదీప్ ఆ ప్రాంత ప్రజలకు డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి 80వ డివిజన్ అధ్యక్షులు బివిఎస్ఎంకె.జోగినాయుడు, సూరిశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి రమణబాబు, బుద్ద ఈశ్వరరావు, పొలిమేర మణి, జనసేన పార్టీ నాయకులు సూరిశెట్టి శివ, పెంటకోట మధు, సూరిశెట్టి శ్రీను, ఏఎన్ఎం నాగజ్యోతి, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి బోర్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామపంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి బోరు నిర్మాణ పనులను బుధవారం గ్రామ నాయకులు,పెద్దలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వద్దాది అప్పలరాజు, ఎంపీటీసీ సీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గినాయుడు, గండ్రెడ్డి అప్పారావు, సరిపల్లి విష్ణు, కోన సత్యనారాయణ, గొంతిన పైడిరాజు, గండ్రెడ్డి వెంకట రమణ, అక్కిరెడ్డి అచ్చిబాబు, అప్పలరాజు, కష్ణంరాజు, పెద్ద చిన్నోడు, రాపర్తి కొండబాబు, మడక సూరిబాబు, బొబ్బరి సత్యారావు పాల్గొన్నారు.

పెదనాయుడుపాలెంలో...

సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు పెదనాయుడుపాలెం శ్మశాన వాటికలో ఎంపీపీ నిధులతో మంజూరు చేసిన బోరుబావి నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు సబ్బవరపు శ్రీను, పంచాయితీ ఉప సర్పంచ్ మండల లక్ష్మణరావు, జనసేన పార్టీ నాయకులు గండి దుర్గా ప్రసాద్, మూర్తి లక్ష్మణరావు, గండి పెద దేముడు, గండి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సత్యవతికి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : బొజ్జన్న కొండ అభివృద్ధికి కృషి చేసి కొత్త రూపులకు బాటలు వేసిన మాజీ ఎమ్‌పి డాక్టర్ బివి.సత్యవతికి బుధవారం రాష్ట్ర బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు వై.హరిబాబు, బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు సత్కరించారు. శంకరం బొజ్జన్న కొండ అభివృద్ధికి రూ.15 కోట్ల 50 లక్షలు నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నాడు ఎంపీ నిధులు మంజూరు చేయించి బొజ్జన్న కొండ అభివృద్ధికి కషి చేశారని కొనియాడారు. అనంతరం విశాఖ ఈ నెల 27 జరిగే బుద్ధునితో నా ప్రయాణం ఆహ్వాన గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం, పల్లా బాబ్జీ, సావల నూకరాజు, బత్తుల గౌతమ్ బాబు, జాన్ బాబు పాల్గొన్నారు.

హెరిటేజ్ పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు ఏరువాక బోనస్‌గా రూ.3 కోట్ల 26 లక్షలు బుధవారం అచ్యుతాపురంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెయిరీ జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు స్థానిక హెరిటేజ్ డెయిరీ ప్లాంట్‌ను సందర్శించారు. ఆరు నెలల బోనస్ మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెరిటేజ్ రీజినల్ మేనేజర్ పి తులసి నాయుడు, ఏరియా మేనేజర్ మనోహర్, మేనేజర్ కూండ్రపు శేషు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - రావికమతం:మండల కేంద్రంలో వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి 150 మంది గుండె వ్యాధి గ్రస్తులు హాజరయ్యారు. వీరికి ఎన్ఆర్ఐ, అనిల్ నీరుకొండ గుండె వ్యాధి నిపుణులు మీసాల సుజిత్ కుమార్ నాయుడు, సత్యారావులు బుధ వారం స్టార్ వన్ లోన్స్ భవనంలో ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణులు మీసాల సుజిత్ కుమార్ నాయుడు, సత్యారావులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన వైద్యం కొరకు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవడానికి అనేకమంది నిరుపేదలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. అటువంటి వారందరికీ ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ త్రినాథ్, ఈసీజీ టెక్నీషియన్ కృష్ణ, పులగాయల గోవింద, ఎంపిటీసీ వేపాడ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యులు

పెదమదీనా బస్‌ను యథావిధిగా నడపాలి

పలు గ్రామాల ప్రజల ఆందోళన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : విశాఖపట్నం ద్వారకా బస్ కాంప్లెక్స్ నుండి 30 సంవత్సరాలుగా అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం పెద మదీనా గ్రామానికి వస్తున్న విశాఖపట్నం డిపో ఆర్టీసీ బస్సు గత ఐదు నెలలుగా రాకపోవడంతో 8 గ్రామాల ప్రజలు బుధవారం బస్సు ముందు ఆందోళన నిర్వహించారు. విశాఖపట్నం వయా పెందుర్తి, సబ్బవరం, చోడవరం, వడ్డాది, బుచ్చయ్యపేట, కేపి అగ్రహారం, కొండపాలెం మీదుగా పెదమదీనా వచ్చే ఈ బస్సు చుట్టుపక్కల ప్రజలకి రవాణా పరంగా, అలాగే రోగులకు హాస్పటల్ వెళ్లేందుకు విద్యార్థులు స్కూలుకి వెళ్లేందుకు రాకపోకలకు ఈ బస్సు అందుబాటులో ఉండేది. గత ఐదు నెలల కాలంగా ఈ బస్సును అధికారులు దారి మళ్ళించారు. బుచ్చయ్య పేట, కెపి అగ్రహారం, కొండ పాలెం, మీదుగా వెళ్ళే ఈ బస్సును, బుచ్చయ్యపేట కందిపూడి జంక్షన్ మీదుగా పెద్ద మదీనాకు నడుపుతున్నారు. దీంతో పలు గ్రామాలకు చెందిన వారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులు స్కూలుకు వెళ్లే అవకాశం కూడా లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి తమ ఇబ్బందులు గుర్తించి తక్షణమే ఈ బస్సును గతంలో మాదిరిగా నడపాలని



బస్సు ముందు ఆందోళన నిర్వహిస్తున్న ప్రజలు

కోరుతున్నారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. బుధవారం పెదమదినిలో ఈ బస్సును అడ్డగించి నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమంలో సమరశత సేవ ఫౌండేషన్ జిల్లా ప్రముఖ ఎం.వరహానాగేశ్వరరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కె. అచ్చంనాయుడు, కొండపాలెం సర్పంచ్ ఎం. వెంకటస్వామి నాయుడు, మాజీ జెడ్పిటిసి వి. అప్పారావు, కేపీ అగ్రహారం సర్పంచ్ జి. శ్రీనివాసరావు, గున్నెంపూడి సర్పంచ్ ఎం. హరిణీ అప్పారావు, ఎంపీటీసీ కె. వెంకటరావు, బాబ్జి, బుజ్జి, రాజు అలాగే 8 గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు హోం మంత్రి అనిత రాక

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 10న గురువారం జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు హెూంమంత్రి వంగలపూడి అనిత హాజరు కానున్నారని నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10వ తేదీ గురువారం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్, టీచర్ మీట్ కు పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. ఎంఈఓ నరేష్ బుధవారం పలు పాఠశాలలను సందర్శించి, ఏర్పాట్లపై హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమీక్షించారు. పలు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులంలో అలంకరణ చేపడుతున్నారు. ఫోటో గ్యాలరీని అందముగా ఏర్పాటు చేశారు.

గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి- పాయకరావుపేట: పాయకరావుపేట గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రు కుమార్ రాజా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో లైబ్రరియన్ వామాల లక్ష్మణరావు (శ్రీను) ను అభినందించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి లైబ్రరియన్ వి ఆనంద్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కుమార్‌రాజా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి- రావికమతం:పరిసరాల పరిశుభ్రత తోనే ప్రజలందరూ ఆరోగ్యవంతంగా ఉండగలరని ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. మండలంలో కవగుంట గ్రామంలో బుధవారం పర్యటించారు. గ్రామ పరిసర ప్రాంతాలు, గ్రామ పురవీధులు, డ్రైన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకన్న బాబు మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో కలిగే ఉపయోగాలు గురించి తెలియపరిచారు. ఈగలు, దోమలు లేని గ్రామంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు గాను గ్రామ పరిసర ప్రాంతాల్లో చెత్తా,చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే ప్రజలకు ఎటువంటి వ్యాధులు, రోగాలు లేకుండా ఉండగలుగుతామన్నారు. బహిరంగ మలవిసర్జన మానుకొని మరుగుదొడ్లను ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాబు, సర్పంచ్ దాసరి సూర్యకుమారి, దాసరి వరహాలు పాల్గొన్నారు.



చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పథకాలపై నిర్లక్ష్యం వహించొద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల:ప్రభుత్వం అందజేస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి పథకాల పట్ల నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి, సచివాలయ వైద్య సిబ్బంది సమావేశంతో ఏర్పాటు చేశారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రఘురాం, పలువురు మండల స్థాయి అధికారులు, సచివాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సత్తమ్మతల్లి పండగ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో గురువారం సత్తమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ ప్రధాన నిర్వాహకులు నడింపల్లి సూర్యనారాయణరాజు (రాజుబాబు) తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చింతలపాటి కుటుంబీకులు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఆషాడ మాసంలోని తొలి ఏకాదశి తర్వాత వచ్చే గురువారం జాతర చేయడం ఆనవాయితీగా వస్తుందని, అమ్మవారి జాతర ఉత్సవాలకు పలు ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. ఆలయానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు.

ఆయిల్ ఫామ్ పంటలతో అధిక లాభాలు



మాట్లాడుతున్న సంఘం ప్రెసిడెంట్

ప్రజాశక్తి-నాతవరం: మండలంలోని వలసంపేట గ్రామంలో బుధవారం ఉద్యాన శాఖ, పతాంజలి కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ తోటల విస్తరణ సమావేశం జరిగింది. జిల్లా ఆయిల్ ఫామ్ రైతు సంఘం సంఘం ప్రెసిడెంట్ సీతారామరాజు మాట్లాడుతూ, నీటి వసతి కలిగిన రైతులందరూ వక్క, జాజి, పిప్పళ వంటి ఇతర పంటలు వేసుకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని చెప్పారు. పతాంజలి సీనియర్ మేనేజర్ టీ.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఫెర్టిలైజేషన్, మల్చింగ్ యాంత్రికరణ వంటి పద్ధతులను పాటించడంతో అధిక దిగుబడిన సాధించడం, ఎరువులు, కూలీల ఖర్చులు తగ్గించుకోవచ్చు అని తెలిపారు. తాండవ రిజర్వాయర్ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఆయిల్ ఫామ్ నెంబర్ పైల పోతురాజు, వైసీపీ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచే రాయితీలను వినియోగించుకోవాలని, విరివిగా ఆయిల్ ఫామ్ పంటలను నాటుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ కే రమేష్, నాగేశ్వరరావు, పంట యాజ మాన్య పద్ధతులను వివరించారు.

పశుగ్రాసాలను సాగు చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఎరకన్నపాలెం గ్రామంలో బుధవారం పాడి రైతులు సమావేశాన్ని పశువైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల దిగుబడి పెరగాలంటే వైద్యులు చెప్పిన సూచనలు, సలహాలు మేరకు చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. పాడి పశువుల పెంపకంలో పశుగ్రాసాలు చాలా ప్రాముఖ్యమైనవి, అని ప్రతి పాడి రైతు తనకు ఉన్న భూమిలో కనీసం 10 సెంట్లు అధిక పాల దిగుబడి ఇచ్చే సూపర్ నేపిర్, కో -1,2,3, జొన్న, మొక్కజొన్న తదితర పశుగ్రాసాలు సాగు చేసుకోవాలన్నారు. పచ్చిగడ్డితో పాటు 5కేజీలు ఎండుగడ్డి, సమపాళ్లలో దాన వేసినట్లుతే పాల దిగుబడి, వెన్న శాతం పెరుగు తుందనీ వివరించారు. ఏక వార్షికాలైన జొన్న, మొక్క జొన్న, సజ్జ, పిల్లి పెసరలు, అలసందలు వాడకంపై పాడి రైతులకు వివరించారు. బహు వార్షికాలైన సూపర్ నేపియర్, పారా గ్రాస్, గినీ గ్రాస్, లూసర్న్ వంటి పచ్చి గడ్డి వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. పశువులకు పచ్చి గడ్డి పెట్టడంతో ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. దీంతో అధిక పాల ఉత్పత్తి జరిగి పాలల్లో వెన్న శాతం పెరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

11న విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-గొలుగొండ :ఈ నెల 11న గొలుగొండ 11కేవీ, చీడిగుమ్మల 11 కేవీ, కృష్ణదేవిపేట 11 కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవిఎన్ఎం. అప్పారావు తెలిపారు. గొలుగొండ 33కేవీ లైన్స్ మరమ్మత్తుల కారణంగా గొలుగొండ, జోగంపేట, సాలికమల్లవరం, పాతమల్లంపేట, జానకిరాంపురం, పప్పుశెట్టిపాలెం, ఎర్రవరం, శ్రీరామపురం, నర్సింగబెల్లి, చిన్నయ్యపాలెం, అనంతసాగరం, కొత్తమల్లంపేట, అమ్మపేట, రేఖపల్లి, గింజర్తి, చోద్యం, విప్పలపాలెం, గాదంపలెం, గైరంపేట, లింగంపేట, లింగందొరపాలెం, రామచంద్రపురం, తాళ్లచీడికాడ, గుజ్జుమానుపాకల, గోకిరి పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరిం చాలని కోరారు.

శ్రీచైతన్యలో స్టూడెంట్ ఎన్నికలు

ప్రజాశక్తి-పాయకరావుపేట:పాయకరావుపేటలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో బుధవారం విద్యార్థుల స్టూడెంట్ కేబినెట్ ఎన్నికలు జరిగాయి. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, సిసిఎ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్ తదితర పదవుల కోసం విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. తన తొలి ఓటుతో చిట్టిబాబు ఈ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా

చిట్టిబాబు మాట్లాడుతూ... ఇటువంటి ఎన్నికలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించగలుగుతామని చెప్పారు. ప్రిన్సిపల్ పంచదార్ల మాణిక్యాలరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలు, క్రమశిక్షణ, వంటి విలువలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమణ, డీన్ మనీష్, సీ బ్యాచ్ ఇంఛార్జి లక్ష్మీకాంతం, ఏవో విజయ్, ప్రీ-ప్రైమరీ ఇంఛార్జి గౌరీ, ప్రైమరీ ఇంఛార్జిలు కల్పన, ఝాన్సీ, పీఈటీలు గణేష్, సువర్ణరాజు పాల్గొన్నారు.



ఓటు వేసిన చిట్టిబాబు

గ్రావెల్ ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న 6 ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు సిఐ కుమారస్వామి తెలిపారు. జానకయ్యపేట నుండి గ్రావెల్‌ను ట్రాక్టర్ల పై తరలిస్తుండగా, హెటిరో రోడ్డు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. వీటిని తహసిల్దార్ కు అప్పగించామన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో అన్ని పంచాయతీ గ్రామాల్లోనూ ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో డి.సీతారామరాజు తెలిపారు. బుధవారం మండలంలో గుల్లిపాడు, దోసలపాడు, జి.జగన్నాధపురం, ముకుంద రాజుపేట గ్రామాల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఇంటింటా తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. వాటర్ ట్యాంకులు క్లీనింగ్ చేయించాలన్నారు.

ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుందాం



హెచ్‌పిసిఎల్ వద్ద....

ప్రజాశక్తి-యంత్రాంగం

అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల వద్ద పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుందామని సమ్మె నేపథ్యంలో కార్మికులు నినదించారు.

విశాఖ కలెక్టరేట్ : ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ఆధ్వర్యాన ఎల్ఐసి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రభుత్వ రంగానికి వ్యతిరేకంగా ఉందని, అన్నింటినీ ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుందని విమర్శించారు. బ్యాంకులు, ఎల్ఐసి, జిఐసి, స్టీల్ ప్లాంట్‌తో సహా పలు ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. బీమాలో ఎఫ్‌డిఐని 100 శాతానికి పెంచాలనే ప్రతిపాదన దేశానికి, పాలసీదారుల ప్రయోజనాలకు హానికరం అన్నారు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జిఎస్‌టి మరొక ప్రజా వ్యతిరేక చర్య అన్నారు. బ్యాంకులు, ఎల్ఐసిలో సిబ్బంది నియామకం అవసరం చాలా ఉందని, దీని కోసం యూనియన్లు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నాయని, వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను 4 కార్మిక కోడ్‌లుగా సవరించడం కార్మికులను బానిసత్వంలోకి నెట్టి, వారు కష్టపడి పోరాడి సంపాదించిన హక్కులను కోల్పోయే మరో తిరోగమన చర్య అని పేర్కొన్నారు. కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్‌పిఎస్, యుపిఎస్ అమలుకు వ్యతిరేకంగా పోరాటం అన్ని రంగాలలో కొనసాగుతోందన్నారు. పాత పెన్షన్ పథకం కోసం డిమాండ్ ఊపందుకుందని, వెంటనే ఒపిఎస్ అందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని దేశవ్యాప్తంగా కార్మికులు పోరాడుతున్నారన్నారు. ఇప్పుడున్న ద్రవోల్బణంలో కుటుంబం గడపడానికి కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమావేశానికి ఐసిఇయు అధ్యక్షులు ఎంకామేశ్వరి అధ్యక్షత వహించారు.

గాజువాక : అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన స్టీల్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, ఎఐటియుసి నాయకుడు డి.ఆదినారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పుచేసి లేబర్ కోడ్స్‌ను అమలు చేయాలని చూస్తోందన్నారు. దీని వల్ల కార్మికులకు తీవ్ర నష్టం అని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం నిర్బంధం ప్రయోగిస్తుందన్నారు. ప్లాంట్‌కు లాభాలు వస్తున్నా జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. గంటపాటు సాగిన ధర్నాలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కెఎస్ఎన్.రావు, కె.రామకృష్ణ, పివి.రమణమూర్తి, శ్రీనివాసరాజు, అప్పలరెడ్డి పాల్గొన్నారు. కార్మికులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

భెల్‌లో సమ్మె

అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన భెల్‌లో సమ్మె చేపట్టారు. ఏ షిఫ్ట్, జనరల్ షిఫ్ట్‌లో కార్మికులు, ఉద్యోగులు విధులకు వెళ్తున్న సమయంలో సమ్మె ప్రాధాన్యత తెలియజేస్తూ మెయిన్ గేటు వద్ద నినాదాలు చేశారు. భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి.ప్రకాష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు అధోగతి పాలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.సాహూ, సీతన్నాయుడు, పివిఎన్.రాజు, ఎస్.జగన్నాధరావు, బి.బాబూరావు, వారాడ ఆనందరావు, పి.కనకారావు, మురళీశ్వరరావు, దేవుడు, కె.నారపరెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో...

కరాస: ఎన్ఎస్‌టిఎల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ గౌరవ్ కుమార్ ప్రజాపతి ఆధ్వర్యాన సమ్మె నిర్వహించారు. పాత పెన్షన్ పథకం పునరుద్ధించాలని, కాంట్రాక్టు, పెన్షనర్ల పున్ననియామకం స్థిర-కాలిక ఉపాధిని నిలిపివేయాలని, ప్రత్యక్ష నియామకం ద్వారా అన్ని ఖాళీలను భర్తీ చేయాలని, కార్మిక వ్యతిరేక 4 కార్మిక కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, 100 శాతం కారుణ్య నియామకానికి ఉత్తర్వు జారీ చేయాలని, ఉద్యోగులకు అనుకూలంగా వెలువడిన అన్ని కోర్టు తీర్పులను అమలు చేయాలని, అన్ని డిఆర్‌డిఒ ఉద్యోగులకు రిస్క్ అలవెన్స్‌ను పరిగణించాలని నినదించారు.


ఎల్ఐసి వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

సమ్మెలో నినదించిన కార్మికవర్గం


ఎన్ఎస్‌టిఎల్‌లో...

ములగాడ : అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన హెచ్‌పిసిఎల్ గేటు వద్ద బుధవారం ఉదయం 6 గంటల నుంచి సమ్మె చేపట్టారు. ఈ సమ్మెలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. హెచ్‌పిసిఎల్ ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. హెచ్‌పిసిఎల్ గేటు వద్ద కాంట్రాక్టు కార్మికులంతా నినాదాలు చేశారు.

హిందుస్తాన్ షిప్‌యార్డు కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. షిప్‌యార్డు ఉద్యోగులు, ఎల్ అండ్ ఎం సీరీస్ ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఆయా కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బి.నాగభూషణం, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు వై.అనిల్‌కుమార్, ఎఐటియుసి జిల్లా నాయకులు సత్యాంజనేయ, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పి.పైడిరాజు, ఎం.సత్యనారాయణ, పివి.రమణ, రాజబాబు, కాటంరాజు తాతబాబు, నరేష్, కె.పెంటారావు, ఈశ్వరరావు, లండరాజు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు


అవగాహన కల్పిస్తున్న దినేష్‌కుమార్

పశుగ్రాసం సాగుపై అవగాహన

ప్రజాశక్తి-కె.కోటపాడు : శాస్త్రీయ పద్ధతిలో పశుగ్రాసం సాగు చేసే విధానంపై ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు దినేష్ కుమార్ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. 5 నుండి 6 లీటర్ల పాలిచ్చే పశువులకు దాణా అవసరం లేకుండా కేవలం పచ్చిమేత తోనే పోషణ చేపట్టవచ్చునని చెప్పారు. పశుగ్రాసం అన్ని ప్రాంతాల్లో అన్ని సమయాల్లో సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులందరూ వినియోగించుకోవలసిందిగా కోరారు.

చోడవరం : మేలు రకం పశుగ్రాసంతో అధిక దిగుబడి వస్తుందని, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ చిందాడ సత్యం అన్నారు. చోడవరం మండలం జన్నవరం గ్రామంలో గోవాడ పశు వైద్య అధికారి పర్యవేక్షణలో, పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా బుధవారం పాడి రైతులకు అవగాహన కల్పించారు. సబ్సిడీ పశుగ్రాస విత్తనాలు, జొన్న , పిల్లి పెసర వాటిని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో జన్నవరం సర్పంచ్ కే సన్యాసిరావు, స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహారావు, పాడి రైతులు, గ్రామ ప్రజలు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షులుగా గోకివాడ భారతి

భర్త స్థానంలో భార్య ఎంపిక చెల్లదన్న జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : టిడిపి మండల అధ్యక్షులుగా గోకివాడ భారతిని ఎన్నుకున్నారు. బుధవారం బుచ్చయ్యపేటలో జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని ఎన్నికల పరిశీలకులు అద్దేపల్లి జగ్గారావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అనంతరం నూతన అధ్యక్షులు భారతిని పార్టీ నాయకులు శాలువాకప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు గోకివాడ కోటేశ్వరరావు, డోంకిన అప్పలనాయుడు, తామరాన దాసు, కోరుకొండ రవి, సాయం శేషు, దొండ నరేష్, దొండ గిరి, మరిసా నరేష్, తదితరులు పాల్గొన్నారు. అయితే మండల టిడిపి అధ్యక్ష పదవి ఎన్నికలో భర్తలు పని చేసిన స్థానంలో భార్యల నియామకాలు చెల్లవని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు స్థానిక విలేకరులకు బుధవారం రాత్రి తెలిపారు. పార్టీ మండల అధ్యక్ష నియామకాల్లో అధిష్టానం కొన్ని నిబంధనలను సూచించిందని, వాటి ప్రకారమే ఎంపిక జరుగుతుందని తెలిపారు.

స్మార్ట్ విద్యుత్ మీటర్లతో ఇబ్బందులు

ప్రజాశక్తి-వడ్డాది : విద్యుత్ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు విద్యుత్ బిల్లులు చెల్లించిన విద్యుత్ కనెక్షన్లు నిలిపోయటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణలు విద్యుత్ బిల్లులు చెల్లించిన కరెంట్‌ని నిలువుదల చేయడంతో ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి చెందిన గోపాసన శంకర్‌కు కేటగిరి-2తో విద్యుత్ అవసరాలు తీర్చుకుంటున్నారు. కేటగిరి 2లకు ఇటీవల కాలంలో స్మార్ట్ మీటర్లుగా అమర్చారు. శంకర్‌కి విద్యుత్ సర్వీస్ నెంబర్ 1778 గల మీటర్‌కి మే నెల విద్యుత్ బిల్లు రూ.1778 వచ్చింది. ఈ మొత్తంతో పాటు రూ.110 ఫైన్‌తో రూ.1888 విద్యుత్ బిల్లు రెండు రోజుల క్రితం ఈ సేవ ద్వారా చెల్లించారు. విద్యుత్ బిల్లులు చెల్లించిన విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులు వద్దకు వెళ్లిన ప్రయోజనం లేకపోయింది. ఇదే గ్రామానికి చెందిన గిడితూరి ఈశ్వరరావుది కూడా అదే పరిస్థితి. విద్యుత్ బిల్లులు చెల్లించిన మూడు రోజుల తర్వాత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఇలాంటి సమస్యలు చాలామందికి ఎదురవుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ప్రజలకు విద్యుత్ ఆ సౌకర్యాలను కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన పంచాయితీ ముందస్తు అభివృద్ధి సూచికల (పిఎఐ 2.0)పై సచివాలయ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ పి. పద్మజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అభివృద్ధికి కావలసిన 9 సూచికలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈఓపిఆర్‌డి చైతన్య, ఎఓ శివప్రసాద్, నారాయణ పాల్గొన్నారు